# కళ్ళజోడు పెళ్ళికొడుకు

జి. తులసీరాకు


"అబ్బాయి కళ్ళద్దాలు పెట్టుకోడన్నావ్! మరి పెళ్లి చూపులకు అద్దాలు ఎందుకు పెట్టుకొచ్చాడు?" గౌరప్ప పెళ్లిబ్రోకర్– భీమసేనని నిలదీసాడు.

"అబ్బే...అతనికి కంటిచూపు బాగానే వుందండి. అమ్మాయికి కాస్త స్మార్ట్‌గా కనబడాలని అద్దాలు పెట్టుకున్నట్టున్నాడు" జవాబిచ్చాడు భీమసేన.

"నేను నిన్ను నమ్మను! స్వయంగా అతనికి కంటి పరీక్ష చేస్తాను."

"గౌరప్పగారు...మీది మరీ చాదస్తమండీ! ఈ కాలంలో పిల్లాడు కళ్ళద్దాలతోనే పుడుతున్నాడు!!!"

"తరతరాలుగా మా వంశంలో అందరూ కళ్ళద్దా



లతోనే పుట్టారు. కళ్ళద్దాలతోనే బ్రతికారు, కళ్ళద్దాలతోనే కాలం చేసారు. ఇక నేను సహించలేను! ఎలాగైనా ఈ కళ్ళద్దాలకు బ్రేకులు వేయాల్సిందే!!'' ఆవేశంగా చెప్పాడు గౌరప్ప.

''మాష్టారు... అమ్మాయికి చూపులో లోపం ఉన్నప్పుడు ఆమెకు పుట్టబోయే బిడ్డకు చూపు సరిగ్గా ఉంటుందని గ్యారంటీ ఏమిటి? అటువంటప్పుడు అబ్బాయి కళ్ళజోడు పెట్టుకుంటే ఏమిటి? పెట్టుకోకపోతే ఏమిటి?''

''నీకు 'మెండల్స్ లా' తెలుసా?'' గౌరప్ప అడిగాడు.

''మెంటల్ లా నా? పిచ్చివాళ్ళక్కూడా లాలు, సూత్రాలు ఉంటాయని నాకు ఇప్పుడే తెలిసింది మాష్టారు.''

''శుంఠ! మెంటల్స్‌లా కాదు మండేల్స్ లా'' మెండెల్స్‌ని వత్తి పలుకుతూ చెప్పాడు గౌరప్ప.

''నేను చదువులో వీక్ సార్! ఆ మెంటల్స్‌లా ఏదో తెలిసి ఉంటే ఈపాటికి ప్రెసిడెంట్ అయ్యి ఉండేవాడిని'' ఆ లా తెలిసినవాళ్ళందరూ ప్రెసిడెంట్ అయినట్లు చెప్పాడు బ్రోకర్.

''భార్యకి జుట్టు మామూలుగా ఉంటే భర్తకు రింగులు రింగులుగా ఉన్నప్పుడు, వాళ్లకి పుట్టే బిడ్డకు ఎటువంటి జుట్టు వస్తుంది?'' పెద్ద శాస్త్రజ్ఞుడిలా ఫోజు కొడుతూ అడిగాడు గౌరప్ప.

''అంతమాత్రం తెలీదా? బట్టతల వస్తుంది.'' గర్వంగా చెప్పాడు భీమసేన.

''అందుకే నిన్ను శుంఠ అన్నది. మాష్టారు''

''రింగురింగు జుట్టు వస్తుంది. ఎందుకంటే అది డామినంట్ కాబట్టి.''

''అదేం కాదు. మా అమ్మకు మామూలు జుట్టు, నాన్నకు రింగురింగుల జుట్టు ఉన్నప్పుడు నాకు బట్టతల ఎందుకు వచ్చింది?''

''మూర్ఖులకు అలా వస్తూ ఉంటుంది. ఇప్పుడు చెప్పు. నా కూతురుకి అద్దాలు ఉండి నా అల్లుడికి అద్దాలు లేనప్పుడు వాళ్లకు పుట్టబోయే బిడ్డకు అద్దాలు ఉంటాయా? ఉండవా?''

''ఉండవచ్చు. ఉండకపోవచ్చు.''

''అదేంటి?''

''ఆ పుట్టేబిడ్డ తెలివైనవాడైతే ఉండదు.. మూర్ఖుడైతే ఉంటుంది.''

''వ్వాట్''

''మీరే కదండీ చెప్పారు. మూర్ఖులకు బట్టతల వస్తుందని. అలానే వాడు మూర్ఖులైతే అద్దాలు పెట్టుకోవాల్సివస్తుంది.''

''నీతో ఇంతతసేపు మాట్లాడినందుకు నాది బుద్ధి తక్కువ!'' అని గౌరప్ప భీమసేనను వెంటవేసుకొని ఆ వచ్చినవాడి కంటిచూపు చెక్‌చేయడానికి వెళ్లాడు.

***

''కిలోమీటర్ దూరంలో నిలబెట్టి చీమల్లాంటి అక్షరాలు చదవమంటే ఎలా నాన్నా?'' కూతురు సరస్వతి అడిగింది.

''అంతా నీ మంచి కోసమేనమ్మా''

''ఏం మంచి నాన్నా? నాకు ఇరవై ఏళ్లప్పుడు పెళ్లిచూపులు మొదలెట్టారు. నాకు ఇప్పుడు ఇరవై ఆరేళ్ళు. సరైన వయస్సులో పెళ్లి అయ్యుంటే నీ ముందు ఒక లియనార్డో డావిన్సీని, ఒక కిరణ్ బేడీని నిలబెట్టి ఉండేదాన్ని.''

''ఆ బీడీలు, లారీలు ఏంటే అమ్మాయ్'' గౌరప్ప భార్య వంటింట్లోనుండి కేకేసింది.

''బీడీలు, లారీలు కాదమ్మా... కిరణ్ బేడీ. ఆమె గొప్ప పోలీస్ ఆఫీసర్. నాకు కూతురు పుడితే ఆమె పేరే పెట్టుకోవాలనుకున్నాను.''

''సీతమ్మ, కృష్ణమ్మ అని పేరు పెట్టు కోకుండా ఈ లారీలు, బేడీలు ఏంటో? కలికాలం వచ్చేసింది అంటే ఇదేనేమో'' అంది సరస్వతి తల్లి కనకమ్మ.

''అమ్మా నువ్వు కాస్సేపు ఆగు. నాన్న నిన్న రాత్రి నాకు ఏం కల వచ్చిందో తెలుసా?''

''మనమేమన్నా ఒకే కేబుల్‌లో కరెంట్ కనెక్షన్ ఇచ్చిన రెండు కంప్యూటర్లమా తల్లీ.. డేటాలు షేర్ చేసుకొన్నట్లు కలలు షేర్ చేసుకోవడానికి?!''

''నాకు పెళ్ళి జరిగిన్నట్లు కల వచ్చింది.''

''నిజంగానా?''

''అవును. అప్పుడు నాకు తొంబై సంవత్సరాలు. నీ అల్లుడు వణుకుతున్న చేతుల్తో తాళి కట్టిన్నట్లు, నేను దగ్గుతూ తాళి కట్టించుకున్నట్లు కల వచ్చింది.'' విచారంగా చెప్పింది సరస్వతి.

''కొంపతీసి నీ కలలో అల్లుడికి కళ్లజోడు కానీ లేదు కదా?'' తన అనుమానాన్ని వెల్లబుచ్చాడు గౌరప్ప.

తండ్రిమాటలు విని సరస్వతి 'కరెంట్ షాక్ కొట్టిన కాకిలా అయిపోయింది.

***

వారం రోజుల తర్వాత

''మాష్టారు, మీ కోసం ఫస్ట్‌క్లాస్ సంబంధం పట్టుకొచ్చాను.''

''నాకీ వయస్సులో పెళ్ళేమిటి భీమసేన?'' సిగ్గుపడిపోతూ అన్నాడు గౌరప్ప.

''ఖర్మ, మీ కూతురికి ఫస్ట్ క్లాస్ సంబంధం తెచ్చాను.'' సరిదిద్ది చెప్పాడు భీమసేన.

''అబ్బాయి కళ్ళజోడు పెట్టుకోడు కదా?''

''పెట్టుకోడు కాబట్టే ఫస్ట్‌క్లాస్ అన్నాను. మీరు 'ఊ' అంటే చాలు. అబ్బాయి వాళ్ళు ఇక్కడికి నిమాషాల్లో కాకిలా వచ్చి వాలిపోతారు.''

''నిమిషాల్లో వచ్చి వాలిపోతారా? అదెలా?''

''ధీరూబాయ్ ఉన్నాడు కదా!'' అంటూ భీమసేన తన సెల్‌ఫోన్ తీసాడు. అతడు అన్నట్లే వరుడు వాళ్ళ ఫ్యామిలీతో పాటు నిమిషంలో అక్కడ లాండ్ అయిపోయాడు. ఆ వచ్చే వరుడు తల పక్కకి వంచుకుని ఇంట్లోకి అడుగుపెట్టాడు. అతని కుడి చెవి భుజానికి ఆని వుంది.

''అదేంటి. అతని తల అలా వాలిపోయి ఉంది?'' గౌరప్ప భీమసేనని అడిగాడు. భీమసేన అబ్బాయి ఆంజినేయుల తల్లిని అడిగాడు.

''రిలయన్స్ టు రిలయన్స్ కాల్స్ ఫ్రీ అయినప్పటి నుండి వాడు అలా అయిపోయాడండీ.'' చెప్పిందామె.

అప్పుడు గమనించాడు గౌరప్ప, భీమసేన... ఆంజనేయుల తలకీ, భుజానికీ మధ్యలో ఉన్న చిన్ని సెల్‌ఫోన్‌ని. కరెక్ట్‌గా అప్పుడు అతని ఫోన్ మోగింది. ఆంజనేయులు కాల్ రిసీవ్ చేసుకొని మాట్లాడడం ప్రారంభించాడు. ''ఏంటి చెప్పండి? ఆ... ఆ.. ఇరవై అడుగుతున్నాడా? పదిహేనుకు ఒప్పుకోవడం లేదా? పోనీ పదికి?''

''ఏమిటయ్యా పదిహేను, ఇరవై అంటున్నాడు.. కోట్లా?'' గౌరప్ప భీమసేనను పక్కకు తీసుకెళ్లి అడిగాడు.

''నాకూ తెలీదండీ.'' చెప్పాడు భీమసేన.

అతను వెళ్లి ఆంజనేయులు తల్లిని ''ఎవ్వరితో నండీ అబ్బాయి మాట్లాడుతున్నాడు?'' అని వినయంగా అడిగాడు.

''ఇంకెవ్వరితో.. ఈ ఇంటి గేటు వద్దనున్న వాళ్ళ నాన్నతో. ఆటోవాడి డబ్బు గూర్చి మాట్లాడుకుంటున్నారు.''



"దానికి ఫోన్ చేసి మాట్లాడాలా?" విస్తుపోతూ అడిగాడు గౌరప్ప.

"అప్పుడే ఏం చూసారు? ముందు ముందు అంతా మీకే అర్థమవుతుంది."

ఇంతలో ఆంజనేయులు తండ్రి హాలులోకి రానే వచ్చాడు. కనకమ్మ ఫలహారాలు తెచ్చి పెట్టింది. రెండు నిమిషాలకి సరస్వతి వచ్చి అబ్బాయి ముందు కూర్చున్నది. అతడు సరస్వతిని చూసాడో లేదో ఎవ్వరికీ అర్థంకాలేదు. ఫోన్‌లో ఎవ్వరితోనో 'రోడ్లపైనున్న బురద, కాలువల నుండి వచ్చే కంపు, వీధి కుక్కల వల్ల ఆ వీధివాళ్ళకి కలిగే ఇబ్బందుల' గూర్చి తీవ్రంగా ఎవ్వరితోనో చర్చ జరుపుతున్నాడు. గౌరప్ప కాస్సేపు ఓపిక పట్టాడు. ఇక వేచి ఉండలేక ఆయన ఆంజినేయుల తల్లితో, "మీ వాడికి మా అమ్మాయి నచ్చిందో లేదో కాస్త అడిగి చెప్పండి." అన్నాడు.

"అతన్ని చేసుకుంటే నాతో సెల్‌ఫోన్‌లోనే కాపురం చేసేటట్లు ఉన్నాడు. అప్పుడు పుట్టేది నాకు లాలీలు, బీడీలు కాదు. సిమ్‌కార్డులు, సెల్‌ఫోన్‌లు" నిష్ఠూరంగా అంది సరస్వతి.

ఇంతలో ఆంజనేయులు మాట్లాడడం ఆపుచేసి అమ్మాయి వంక ఒక్కసారి చూసి మళ్ళీ ఎవ్వరికో ఫోన్ చేసాడు.

ఆంజినేయుల తల్లి హాండ్‌బాగ్‌లో సెల్‌ఫోన్ మ్రోగింది. ఆమె కాల్ అటెండ్ చేసింది.

"అమ్మా..అమ్మాయి జామ పండులా నిగనిగలాడుతోంది. కానీ జామపండుకు పట్టిన బూజులా ఆ అద్దాలే అసహ్యంగా ఉంది. అయినా పర్వాలేదు. నాకు ఓ.కె." గుక్క తిప్పుకోకుండా చెప్పాడు.

కట్నాలు, కట్నం కింద ఎన్ని సెల్‌ఫోన్‌లూ సిమ్ కార్డులు ఇస్తారు అని కాస్సేపు మాట్లాడుకొని, వాళ్ళు అక్కడి నుండి ఫోన్‌లో ఆటోని పిలిపించుకుని అందులో వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్లిపోగానే అడిగాడు గౌరప్ప సరస్వతిని... "ఏమ్మా.. అబ్బాయి నచ్చాడా?"

"లేదు."

"అతనికి కళ్లజోడు లేదు కదమ్మా"

"అతన్ని చేసుకుంటే నాతో సెల్‌ఫోన్‌లోనే కాపురం చేసేటట్లు ఉన్నాడు. అప్పుడు పుట్టేది నాకు లాలీలు, బీడీలు కాదు. సిమ్‌కార్డులు, సెల్‌ఫోన్‌లు" నిష్ఠూరంగా అంది సరస్వతి.

"అలాగంటే ఎలా అమ్మ.. మన భీమసేన ఎంతో కష్టపడి కళ్ళజోడులేని ఆ సంబంధాన్ని పట్టుకొచ్చాడు."

"నాన్నా చూసావు కదా...కళ్ళజోడు పెట్టుకోని వాళ్ళంతా మూర్ఖులు. కళ్ళజోడు ఉన్నవాళ్లకి కాస్తో, కూస్తో తెలివి ఉంటుంది."

"మీ అమ్మకు కళ్ళజోడు ఉందిగా.. మరి దానికేమంటావ్?" అడిగాడు గౌరప్ప.

"నేనేమీ మూర్ఖుణ్ణి కాదు" అన్నాడు భీమసేన.

"ఆ విషయం నువ్వు మాకు చెప్పాల్సిన పని లేదు" సరస్వతి అంది.

"మీ తండ్రీకూతుళ్ళు తర్వాత తీరిగ్గా మాట్లాడుకోవచ్చు. ముందు నా ఫీజు నాకు చెల్లించండి." అడిగాడు భీమసేన.

"పైసలు ఇచ్చి పాపం కొనుక్కున్నట్టు నువ్వు తెచ్చే బోడి సంబంధాలకు డబ్బు కూడానా..." అని సరస్వతి భీమసేనను అక్కడి నుండి తరిమేసింది.

***

వారం రోజుల తర్వాత మళ్ళీ ఒక సంబంధం పట్టుకొచ్చాడు. వచ్చిన వరుడు ఎలుగుబంటికీ, ఏనుగుకీ మధ్య సైజులో ఉన్నాడు. అతని పేరు తిండిపోతు రామన్న. కనకమ్మ తెచ్చిపెట్టిన ఫలహారాలు నిమిషంలో ఖాళీ చేసేసాడు. సరస్వతి వచ్చి అతని ఎదుట కూర్చోగానే, "నీకు మైసూర్‌పాక్ చేయడం వచ్చా?" ఏకవచనంలో అడిగాడు.

"రాదు." చెప్పింది సరస్వతి.

"అమ్మా చూడే. భీమసేన అమ్మాయికి మైసూర్ పాక్ చేయడం వచ్చని చెప్పి పిలుకొచ్చాడు. తీరా చూస్తే అమ్మాయికి మైసూర్‌పాక్ చేయడం రాదంట" మైసూర్‌పాక్‌ని వత్తి పలుకుతూ చెప్పాడు రామన్న.

"పోనీలేరా. నేను నేర్పుతాను కదా" గడ్డం పట్టుకొని నచ్చచెప్పింది అతని తల్లి.

"నీకు చికెన్ మంచూరియన్ వండడం వచ్చా?" రామన్న సరస్వతిని మళ్ళీ అడిగాడు.

"నేను తింటాగా"

"నీకు ఆకలైతే మనుష్యులనే తినేసేటట్లు ఉన్నావ్" అనుకుంది సరస్వతి.

ఆమె జవాబు చెప్పకపోవడంతో "వచ్చా? రాదా?" అని మళ్ళీ రెట్టించాడు తిండిపోతు రామన్న.

"రాదు."

"అమ్మా చూడే. నాన్‌వెజ్ వండడం రాదంట" రామన్న ఫిర్యాదు చేసాడు.

"పోనీలేరా. నేను నేర్పుతాను కదా" చెప్పింది తల్లి.

"టమాటోబాత్ వచ్చా?" అనుమానంగా అడిగాడు రామన్న.

"రాదు."

"మరేమి వచ్చు?"

"వంట చేయడం రాదు" తిండిపోతు రామన్న పక్కలో బాంబు పడ్డట్టు అయ్యింది.

"అమ్మా... చూడే. వంట చేయడం రాదంట. నాకీ సంబంధం ఇష్టం లేదు పో."

"పోనీలేరా. నేను నేర్పుతాను కదా.." బతిమాలింది తల్లి.

"నేను నేర్చుకోను" చెప్పింది సరస్వతి.

"అమ్మా చూడే. వంట చేయడం నేర్చుకోనుదంట.." రామన్న వాపోయాడు.

"పోనీలేరా. నేర్చుకోమని నేను నేర్పుతాను కదా."

"ఏంటి నువ్వు నేర్పేది వంకాయ పులుసు... నేనీ అమ్మాయిని చేసుకోను."

జరిగిందంతా కళ్ళప్పగించి చూస్తున్నారు కనకమ్మ, గౌరప్ప, భీమసేన.

రామన్న తల్లి అతన్ని బతిమాలేటంత టైం గాప్‌లో సరస్వతి ఒక కలకన్నది. తాను గుడి మెట్లపై కూర్చొని భిక్షమెత్తి ఆ డబ్బులతో ఇంటికెళ్తే రామన్న ఆ డబ్బులు లాక్కొని మైసూర్‌పాక్‌లు తెచ్చి తిన్నట్లు తాను నీళ్ళు తాగి కడుపు నింపుకొని కటిక నేలపై పడుకొని నిద్రపోయినట్లు. ఆమె మనస్సంతా అదోలాటి వేదాంత భావంలో నిండిపోయింది.

రామన్న సరస్వతిని పెళ్ళిచేసుకోవడానికి ససేమిరా ఒప్పుకోలేదు.

వాళ్ళక్కడినుండి వెళ్ళిపోయిన తర్వాత గౌరప్ప, "ఛీ.. బంగారం లాంటి సంబంధం. అబ్బాయికి కళ్ళజోడు కూడా లేదు. ఎందుకే వంటరాదని అబద్ధం చెప్పావ్?" అనడిగాడు.

"నేను పెళ్ళి చేసుకోను. అని శపథం చెయ్యాలనుకుంటున్నాను నాన్నా" తన నిర్ణయం చెప్పింది సరస్వతి. గౌరప్పకేమోగానీ.. భీమసేనకు మాత్రం గుండె ఆగినంత పనైయ్యింది. రోజూ బంగారు గుడ్లుపెట్టే బాతుని ఎవ్వరు మాత్రం వదులుకుంటారు?

"ఇంకో పెళ్లి సంబంధం తెస్తాను. బంగారం లాంటిది. ఒక్కటే ఒక్కటి. అది నచ్చకపోతే దాని తర్వాత మీ ఇష్టం. సరే అనండి" సరస్వతిని వేడుకున్నాడు భీమసేన.

"అతనంతగా చెబుతున్నాడు కదా. 'సరే' అను తల్లీ." భీమసేనతో శృతి కలిపాడు గౌరప్ప.

"సరే అనవే?" బలవంతపెట్టింది కనకమ్మ.

"సరస్వతి తన శపథాన్ని 'పోస్ట్‌పోన్' చేసి 'సరే' అనేసింది.

***

పట్టువదలని విక్రమార్కుడిలా భీమసేన ఊరు.. ఊరూ తిరిగి ఒక 'ప్లాటినమ్' లాంటి సంబంధం పట్టుకొచ్చాడు.

అబ్బాయి యోగికి కళ్ళజోడు లేకపోవడంతో గౌరప్పకు వెంటనే నచ్చేసాడు.

సరస్వతినీ, యోగినీ మాట్లాడుకోవడానికి కాస్సేపు ఒంటరిగా వదిలేసారు.

యోగి ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండడంతో సరస్వతి ప్రశ్నించడం మొదలుపెట్టింది.

"మీ దగ్గర సెల్‌ఫోన్ ఉందా."

బైక్, సెల్ ఫోన్ ఉన్న వాళ్లనే ఈమధ్య అమ్మాయిలు ప్రేమిస్తున్నారని యోగికి తెలుసు. సరస్వతి కూడా అలాంటి అమ్మాయే అనుకుంటూ అతడు లేదన్నాడు. అతడి మొహంలో అనుమానం సరస్వతి గమనించింది.

"ఎందుకు కొనుక్కోలేదు?" ప్రశ్నించింది.

"నాకు సింపుల్‌గా ఉండటమంటే ఇష్టం"

గర్వంగా చెప్పాడు యోగి.

''నాకు కూడా. అందుకు ఆ ప్రశ్న అడిగాను'' అబద్ధం చెప్పింది.

''నాకు వంట చేయడం రాదు.''

''నాకూ రాదు'' చెప్పాడు యోగి.

''నేను వంట చేర్చుకోను.''

''నేను నేర్చుకుంటాలే'' యోగి అలా అనడంతో సరస్వతి మనస్సంతా అదోలాటి భావంతో నిండిపోయింది. ఆమె వెంటనే యోగితో పెళ్లికి అంగీకరించింది. గౌరప్ప ఆనందానికి అవధులు లేవు. వెంటనే దేవుడి దగ్గరికి వెళ్ళి ప్రార్థించాడు. అతని ప్రార్థన పూర్తయ్యింతర్వాత అడిగింది సరస్వతి తండ్రిని.

''భగవంతుడిని ఏమని ప్రార్థించావు నాన్నా?''

''ఇంత మాంచి అల్లుడిని నాకు ప్రసాదించినందుకు భీమసేనని తిరుమలకు పరిగెత్తుకుంటూ తీసుకువస్తానని మొక్కుకున్నాను తల్లీ.''

ఆ మాటలు విని భీమసేన గతుక్కుమన్నాడు.

***

సరస్వతి పెళ్ళి చాలా గ్రాండ్‌గా జరిపించాడు గౌరప్ప. అల్లుడికి మర్యాదలలో కానీ మిగతా ఏ విషయంలో కానీ ఏలోటూ రానివ్వలేదు. అంతా బాగానే ఉంది కానీ, యోగికి ఒక్క విషయం అర్థంకాలేదు. గౌరప్ప తన మీద ఇంత ప్రేమాభిమానాలు ఎందుకు చూపిస్తున్నాడు?' అని. సరస్వతిని తనతో బాటు అత్తారింటికి తీసుకెళ్ళే ముందు అడిగాడు యోగి గౌరప్పను.

''మా పెళ్లి కుదిరిందని భీమసేనను తిరుపతి నుండి తిరుమల వరకు పరిగెత్తిచ్చుకుంటూ తీసుకెళ్ళారు. నాపై ఇంత ప్రేమాభిమానాలను చూపిస్తున్నారు. మీరు చూపుతున్న ఇంత ప్రేమకు నేను అర్హుడనేనా?'' ఫిలాసఫీ ఎక్కువగా చదివే యోగి వేదాంత ధోరణిలో అడిగాడు.

''ఎంతమాట! కళ్ళజోడు కనిపెట్టినప్పటినుండి మా వంశంలో అందరూ కళ్ళజోడు వాడినవారే. మా వంశంలో ఈ కళ్ళజోడుకు బ్రేకులు వేయాలన్నదే నా ఆశయం. గత ఆరు సంవత్సరాలుగా మా సరస్వతికి కళ్ళజోడు పెట్టుకోని పెళ్ళికొడుకు కోసం వెతికాను. చివరికి మీరు దొరికారు. ఇదంతా మేము పూర్వజన్మలో చేసుకున్న అదృష్టం'' మెరుస్తున్న కళ్ళతో చెప్పాడు గౌరప్ప. ఆ మాటలు విని యోగి నీరుకారిపోయాడు. మొహం పాలిపోయింది.

''ఏమిటి బాబు ఉన్నట్టుండి అలాగైపోయావు?'' ఆత్రుతగా అడిగాడు గౌరప్ప.

''నేను కళ్ళజోడు వాడను. కాంటాక్ట్ లెన్స్ వాడుతాను'' అని చెప్పాడు... సింపుల్‌గా ఉండడం ఇష్టపడే యోగి.

ఆ మాటలు విని గౌరప్ప 'దబ్'మని క్రిందపడి మూర్ఛపోయాడు.

★



## మల్లి కబుర్లు

**క**త్తెర కళ్ల కత్రీనాకి సినిమాలు తక్కువే అయినా కబుర్లు మాత్రం దంచేస్తుంటుంది. తన యిష్టాయిష్టాలన్నీ ఇలా ఏకరువు పెడ్తోంది. నిజాయితీగా వుండే వాళ్లంటే తనకెంతో ప్రేమట. చీకటంటే భయమట. తనకున్న ఆస్తి అంటూ వుంటే అది ఒకటే...అంకిత భావం అని అంటుంది. జీవితంలో అత్యంత అవసరమైనది తిండి అంటుంది. (ఎవరికైనా అదే కదా...) అసలు మాటకొస్తే రెండు ముఖాల మనుషుల్ని తెగ అస్యహించుకుంటుందట. (ఈ మధ్య ఎవరితో చెడిందో వారేనని అర్థం.) అది సరే నీకిష్టమైన బెడ్‌రూం సంగతులు చెప్పమంటే.. అమాయకంగా ముఖం పెట్టి, 'నాకేం తెలీదే...' అంటుంది. పోనీ నీ హీరో చెప్పరాదా అమ్ముడూ అంటే...'నేనెవర్ని పెళ్లి చేసుకుంటే వాడే..నా కిష్టమైన హీరో...'అంటూ ముసి ముసిగా నవ్వుతుంది. హమ్మ పిల్లా. మొత్తానికి సల్మాన్‌ఖాన్ ఊసు రాకుండా బాగానే నటించింది కదూ. అవును మరి దీన్నే ఫేకింగ్ అంటారు. అనరూ!